క్లుప్తంగా

నేడు మండల సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.వెంకట నారాయణ మంగళవారం తెలిపారు. ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన జరిగే ఈ సమావేశం ఉదయం 10.30 గంటలను ప్రారంభమవుతుందని అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

'భవిత' సేవల పరిశీలన



భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓ

పెద్దాపురం: విభిన్న ప్రతిభా వంతులకు ప్రభుత్వం భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారులు శర్మ, చౌదరి అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్ విభిన్న ప్రతిభా వంతులకు అందిస్తున్న సేవలపై మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు విద్యా శాఖ ద్వారా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సెంటర్ ద్వారా అర్బన్, రూరల్ పరిధిలో విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు మెరుగైన వైద్య, విద్య సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుడైన విద్యార్థికి అందిస్తున్న ఫిజియోథెరపీ ప్రక్రియను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, ఫిజియోథెరపీ వైద్యులు అపర్ణ, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత ఇసుకను సద్వినియోగం చేసుకోండి

ఆర్డీఓ జేఎస్ రామారావు



పెద్దాపురం రీచ్‌లో ఇసుక పంపిణీని ప్రారంభిస్తున్న ఆర్డీఓ తదితరులు

పెద్దాపురం: ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. స్థానిక వాలు తిమ్మాపురం రోడ్డులోని ఇసుక రీచ్‌లో మంగళవారం ఇసుక పంపిణీ విధానాన్ని మంగళవారం ఆయన మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు, నిమ్మకాయల రంగనాగ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జేఎస్ రామారావు మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం ద్వారా గృహ వినియోగదారులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. ఈ విధానం ద్వారా అన్ని రంగాలకు ఉపాధి కలిసి వచ్చే అవకాశం ఉందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యాధికారి రజిని

కొత్తపల్లి: గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కాకినాడ విజన్ హాస్పటల్ గైనకాలజిస్టు డాక్టర్ రజిని, డాక్టర్ సందీప్ అన్నారు. మండలంలోని కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రధాన మంత్రి మాతృత్వ యోజనలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంతో రోడ్లు జలమయం



పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో నిలిచిన వర్షపునీరు

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా మంగళవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయ్యమయ్యాయి. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద, ఉప్పాడ బీచ్‌రోడ్డ సెంటర్‌లో ఇరువైపులా ఉన్న డ్రైన్ ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో నీరు నిలిచిపోతోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లో డ్రైన్లు పూడుకుపోవడంతో నీరు రోడ్లపై చేరుతోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

పరిహారం ఎక్కడ..?

- వేట నిషేధ సమయం ముగిసినా అందని ప్రోత్సాహకం
- మత్స్యకారుల ఎదురుచూపులు
- కష్టతరంగా మారిన జీవనోపాధి
- పట్టించుకోని ప్రభుత్వం



వేట నిషేధ సమయంలో రామన్నపాలెం ఉప్పుటేరు వద్ద నిలిపిన బోట్లు

కొత్తపల్లి: సముద్రంలో మత్స్య సంపద వృద్ధి చెందేందుకు ప్రభుత్వం రెండు నెలల పాటు వేట నిషేధం అమలు చేసింది. ఏటా ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ అర్ధరాత్రి వరకూ చేపల వేటను నిలిపివేస్తుంది. ఈ సమయంలో మత్స్యకారులు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో ప్రభుత్వం పరిహారాన్ని అందిస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వేట నిషేధ పరిహారాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయిత సమయంలో అందించారు. అర్హుడైన ప్రతి మత్స్యకారుడుకి రూ.10వేలను వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేశారు. వేట నిషేధ సమయం ప్రారంభంలోనే అధికారులు బోట్లు రిజిస్ట్రేషన్లను తనిఖీ చేసి అర్హులను గుర్తించి వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసేవారు. అయితే ఈ ఏడాది వేట నిషేధం పూర్తయినా ఇప్పటి వరకూ పరిహారం అందకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. కుటుంబ పోషణ కష్టమవుతోందని ఆవేదన చెందుతున్నారు. ఉపాధిగా ఉన్న చేపల వేట లేకపోవడం, ప్రభుత్వం నుంచి సాయం అందకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని మత్స్యకారులు వాపోతున్నారు.

రూ.20 వేలు ప్రకటించారు..

కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే వేట నిషేధ సమయంలో అర్హులైన మత్స్యకారులకు రూ.20 వేలను పరిహారం అందిస్తామని ఎన్నికల ముందు ప్రకటించింది. అనుకున్నట్టుగానే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట మరిచింది. వేట నిషేధం పూర్తయి సుమారు 25 రోజులు గడుస్తున్నా పరిహారాన్ని అందించలేదు.

గత ప్రభుత్వంలో పరిహారం పొందిన మండల లబ్ధిదారులు

సంవత్సరం	వైఎస్సార్ మత్స్యకార భరోసా లబ్ధిదారులు	బోట్లు
2018–19	4825	886
2019–20	4977	906
2020–21	5324	956
2021–22	4665	886
2022–23	5285	961

అందని పరిహారం



వేట నిషేధ సమయంలో అందించాల్సిన పరిహారం ఇప్పటి వరకూ అందలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వేట నిషేధ సమయంలోనే పరిహారాన్ని అందించేవారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం వేట నిషేధ పరిహారాన్ని అందించే విషయాన్ని ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా పరిహారాన్ని అందించాలి.

–చొక్కా ఏసేబు, మత్స్యకారుడు, ఉప్పాడ

అన్ని విధాలా ఆదుకున్నారు



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకున్నారు. పరిహారాన్ని సమయానికి అందించడంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి అమోఘం. ఈ ప్రభుత్వంలో పరిహారాన్ని అందించడమే మరిచారు. మత్స్య సంపద లభించక, పరిహారం అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం

– వంకా ప్రసాద్, మత్స్యకారుడు, ఉప్పాడ

పూర్తి స్థాయిలో సర్వే



వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించే పరిహారంపై పూర్తి స్థాయిలో సర్వే చేశాం. సర్వే చేసిన నివేదికను ఆన్‌లైన్ కూడా పూర్తి చేశాం. 2023–2024 కి సంబంధించి 1106 బోట్లకు గాను 6604 మంది మత్స్యకారులను గుర్తించాం.

–శ్రీరామకృష్ణ, మత్స్యశాఖ అధికారి కొత్తపల్లి

బడి ఈడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలి



పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఇస్మాయిల్

పిఠాపురం: బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలోనే ఉండేలా చూడాలని జాయినింగ్‌లలో అన్ని పాఠశాలలు వంద శాతం సాధించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర అధికారి ఎండీ ఇస్మాయిల్ ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన చేబ్రోలులోని శ్రీ చల్లా వెంకటరావు శ్రీమతి పద్మరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ కిట్లు సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలన్నారు. పిల్లలందరూ తప్పనిసరిగా ప్రతిరోజు బడికి వచ్చేలా తల్లిదండ్రులను చైతన్య పర్చాలన్నారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష రాష్ట్ర అధికారి ఎండీ ఇస్మాయిల్, సమగ్ర శిక్ష జిల్లా సీఎంఓ సీహెచ్ నాగేశ్వరరావు, ఎంఈఓ బీవీ ప్రసాద్ విద్యార్థులకు అందజేసిన స్కూల్ కిట్లు, అడ్మిషన్ల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులనే విక్రయించాలి

- ఎరువుల దుకాణంలో తనిఖీలు
- నిల్వలను పరిశీలించిన ప్రత్యేక స్క్వాడ్



వేట్లపాలెం ఎరువుల దుకాణంలో నిల్వను పరిశీలిస్తున్న అధికారులు

సామర్లకోట: రైతులకు కావలసిన ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించే లక్ష్యంతో అధికారులు ఆయా ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వం నియమించిన స్పెషల్ స్క్వాడ్ మంగళవారం మండల పరిధిలోని వేట్లపాలెం సత్యసాయి ఎజెన్సీస్‌కు చెందిన ఎరువుల దుకాణంలో తనిఖీ చేసింది. ఎరువులు, పురుగు మందుల నిల్వ రిజిస్టర్లు, బిల్లులు, నిల్వలను పరిశీలించారు. ఈ మేరకు ఐఎస్‌ఐ మార్కు కలిగిన నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు మాత్రమే రైతులకు విక్రయించాలని తనిఖీ బృందంలోని శ్రీకాకుళం జిల్లా డీడీఏ కె.త్రినాథస్వామి సూచించారు. రైతులకు ఎరువులు, పురుగు మందులు విక్రయించిన సమయంలో బిల్లులు తప్పని సరిగా ఇవ్వాలన్నారు. బిల్లులకు, ఎంఆర్‌పీలకు వ్యత్యాసం లేకుండా చూడాలని తెలిపారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదుల వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువులను డీబీటీ పద్ధతిలోనే విక్రయించాలని చెప్పారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు ఉంటాయన్నారు. జిల్లా వ్యవసాయశాఖ టెక్నికల్ అధికారి డీవీవీ సతీష్, ఏఓలు విజయలక్ష్మి, ఐ.సత్య పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో భూమికి సారం

- జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్
- చెందుర్తిలో చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఏఓ విజయ్‌కుమార్

పిఠాపురం: చిరుధాన్యాల సాగుతో భూమికి సారం పెరగడంతోపాటు రైతుకు ఆదాయం లభిస్తుందని, రసాయనాల వాడకం ద్వారా భూమిలో తగ్గిన సారంను పెంచుకోవచ్చని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.విజయ్‌కుమార్ సూచించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన చిరు ధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు చిరు ధాన్యాల సాగు వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్ చార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతులకు చిరు ధాన్యాల సాగు వల్ల కలిగే లాభాలను వివరించామన్నారు. అన్ని గ్రామాల్లోను అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. చిరుధాన్యాలైన రాగి, జొన్న, సజ్జలు, గంటి, ఊదలు వంటి చిరుధాన్యాలు సేద్యం కొంత విస్తరణలో చేయాలని వాటిని ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్ రైతుల్ని కోరారు. ముఖ్యంగా చిరుధాన్యాలకు 50శాతం రైతులకు అందుబాటులో తెస్తావని ఎవరైనా ఉంటే రైతు సేవ కేంద్రంలో సిబ్బందికి తెలియజేయాలని వారికి విత్తనాలు సరఫరా చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎకరానికి రెండు కేజీలు నుంచి మూడు కేజీల విత్తనం పడుతుందని, వాటి సస్యరక్షణ చర్యలను వివరిస్తామని తెలిపారు. ప్రతీ రైతు వీటి ఉపయోగాలు తెలుసుకుని తమ పొలాల్లో సాగు చేసుకోవాలని, పొలాలకు భూసారం పెంచుకోవాలని కోరారు. రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని రైతులు గ్రామ పెద్దలు, ఎఫ్‌టీసీ కార్యాలయం నుంచి సహాయ వ్యవసాయ సంచాలకులు భ్రమరాంబ, పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.స్వాతి మండల వ్యవసాయ అధికారి సత్యనారాయణ రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

100 శాతం హాజరు ఉండాలి

ఎంఈఓ శివరామకృష్ణయ్య



గొంచాలలో విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం హాజరు ఉండాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామ కృష్ణయ్య ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలో గొంచాల, నవర గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని హెచ్‌ఎంలకు సూచించారు. వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు పాఠశాల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. వర్షాలు వచ్చిన సమయంలో పంచాయతీ కార్యదర్శులతో బ్లీచింగ్ పిచికారీ చేయించాలని, పాఠశాలకు హాజరు కాని విద్యార్థులను గుర్తించి వెంటనే తల్లిదండ్రుల నుంచి సమాచారం సేకరించాలన్నారు. కనీసం నెలకు ఒకసారి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల సామర్థ్యాలను వారికి వివరించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, ప్రతి విద్యార్థి పాఠశాలలో భోజనం చేసేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఆర్వో ప్లాంట్ల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించాలని చెప్పారు. ఈ మేరకు విద్యార్థుల నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలను పరిశీలించారు.

చురుగ్గా కోనోకార్పస్ చెట్ల తొలగింపు

- పర్యవేక్షించిన కమిషనర్, డీఎఫ్ఓ
- మొదట పార్కుల్లో.. దశల వారీగా పాఠశాలల్లోనూ తొలగింపు



పార్కును సందర్శించిన కమిషనర్ వెంకటరావు

కాకినాడ: పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హాని కలిగించే కోనోకార్పస్ చెట్ల తొలగింపు ప్రక్రియ వేగవంతం చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.భరణి చెప్పారు. మంగళవారం కమిషనర్, డీఎఫ్ఓలు జన్మభూమి పార్క్, బోట్ క్లబ్ పార్కులను సందర్శించారు. ఇటీవల కలెక్టర్ షాన్ మోహన్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఆ చెట్ల తొలగింపు వేగవంతం చేయడంతో పాటు, ప్రత్యామ్నాయ చర్యలను ఇద్దరు అధికారులు పర్యవేక్షించారు. తొలుత జన్మభూమి పార్క్‌ను, ఆ తర్వాత బోట్ క్లబ్ పార్క్‌ను అధికారులు సందర్శించారు. కాకినాడలోని వివిధ పార్కుల్లో ఈ చెట్లు సుమారు 500 ఉండగా ఒక్క బోట్ క్లబ్ పార్క్‌లోనే 100 ఉన్నాయి. వీటిని తొలగిస్తున్న విధానాన్ని పర్యవేక్షించి ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరీల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీటి స్థానంలో టబూబియా బాటిల్ బ్రష్, వెదురు వంటి మొక్కలను నాటే అంశంపై చర్చించారు. కళాశాలలు, పాఠశాలల్లో కూడా వీటిని దశలవారీగా తొలగిస్తామన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



హుస్సేన్‌పురంలో డస్ట్‌బిన్లు అందజేసిన సర్పంచ్, గ్రామ నాయకులు

సామర్లకోట: పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం ఏర్పడుతుందని వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహిమవతి, గ్రామ సర్పంచ్ మార్ని నాగమణి అన్నారు. మంగళవారం హుస్సేన్‌పురం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ తడి, పొడిచెత్త వేయడానికి రెండు డస్టు బిన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగమణి మాట్లాడుతూ ఇంటిలో చెత్తను డస్ట్ బిన్‌లలోమాత్రమే వేయాలన్నారు. పంచాయతీ శానిటరీ సిబ్బంది వచ్చిన సమయంలో వాహనాలకు చెత్తను అందజేసి పరిసరాలు పరిశుభ్రంగా ఉండడానికి సహకరించాలన్నారు. అనంతరం గ్రామంలోని గర్భిణులు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల నుంచి వచ్చిన పౌష్టికాహారాన్ని అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలు నివారించవచ్చునని శ్రీహిమవతి తెలిపారు. ఉప సర్పంచ్ యవర్న చంద్రశేఖర్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పార్కుల్లో ఆరోగ్యకారక మొక్కలు

జిల్లా అటవీ శాఖ అధికారి భరణి



రమణయ్యపేటలో బోట్‌క్లబ్ పార్కును పరిశీలిస్తున్న జిల్లా అటవీ శాఖ అధికారి భరణి

కాకినాడ రూరల్: పార్కుల్లో సందర్శకుల ఆరోగ్యం పెంచే దిశగా ఆరోగ్యకరమైన మొక్కలు పెంచాల్సి ఉందని జిల్లా అటవీ శాఖ అధికారి భరణి పేర్కొన్నారు. కాకినాడ 1వ డివిజన్ పరిధిలోని రమణయ్యపేట బోట్‌క్లబ్ పార్కును మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తదితరులతో ఆమె సందర్శించారు. పార్కులో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పెంచాల్సిన మొక్కల గురించి వారు చర్చించారు. భరణి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతకు మొక్కలు దోహదపడతాయన్నారు. మొక్కల వల్ల ఆక్సిజన్ శాతం పెరిగి కాలుష్యం తగ్గుతుందన్నారు. ఉద్యానవనాలలో కాలుష్య కారక మొక్కలు వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. వాటిని తొలగించి వాటి స్థానే ఆరోగ్యాన్ని ఇచ్చే మొక్కలు నాటేందుకు అటవీ శాఖ సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో అటవీ, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

పట్టించుకోని విద్యుత్ శాఖాధికారులు



పూర్తిగా శిథిలమైన స్తంభం అడుగు భాగం



రాపర్తిలో ప్రమాదస్థితిలో ఉన్న విద్యుత్ స్తంభం

పిఠాపురం: అది ప్రతి నిత్యం ప్రజలు సంచరించే ప్రాంతం. పలువురు చిన్నారులు విద్యార్థులు తిరిగే రోడ్డులో విద్యుత్ స్తంభం ప్రమాద స్థితిలో ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోడంలేదు. గత కొన్ని నెలలుగా పిఠాపురం మండలం రాపర్తి పార్కు సెంటర్ వద్ద ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం తుప్పు పట్టి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే స్తంభం అడుగు భాగం పూర్తిగా శిథిలమై ఏక్షణంలోనైనా కూలి పోయే పరిస్థితిలో ఉంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఈదురు గాలులు వీస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి స్తంభం తొలగించి కొత్తది వేయించాలని కోరుతున్నారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రెసిడెంట్‌గా వెంకటపతి, సెక్రటరీగా పవన్



నూతనంగా ఎన్నికైన సభ్యులతో జిల్లా నాయకులు

పిఠాపురం: స్థానిక పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక సూర్యరాయ గ్రంథాలయ హాలులో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు స్వయంభారపు భద్రరావు, వైస్ ప్రెసిడెంట్ మెల్లిపాక నాగబాబు, జిల్లా జాయింట్ సెక్రెటరీ నల్లమిల్లి అర్పణ కుమార్, జిల్లా ట్రెజరర్ వాగ్దాటి ధరణి హాజరై ఎన్నికలు నిర్వహించారు. పిఠాపురం పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రెసిడెంట్‌గా అల్లూరి వెంకటపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రెసిడెంట్ జిల్లా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా కోట శివ, యూనియన్ సెక్రటరీగా నల్లమిల్లి పవన్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా ద్రాక్షారపు దత్తు, ట్రెజరర్‌గా కోట సత్తిబాబు, ఆదనపు జాయింట్ సెక్రటరీగా చిక్కాల రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులతో జిల్లా గౌరవ అధ్యక్షుడు స్వయంవరం భద్రరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ సలహాదారులు, స్టీరింగ్ కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రాక్ సిరామిక్స్ ఉద్యోగులు

కాకినాడ సిటీ: ఎన్నికల ముందు రాక్ సిరామిక్స్ సామర్లకోట టైల్స్ పరిశ్రమలో ఏ కారణమూ లేకుండా తొలగించిన 24 మంది పర్మినెంట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. యూనియన్ నాయకులు చెక్కల రాజ్‌కుమార్, దారపురెడ్డి క్రాంతి, మలకా రమణ, రాక్ సిరామిక్ ఉద్యోగి చంద్రశేఖర్ మాట్లాడారు. ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా 18 ఏళ్ల నుంచి పని చేస్తున్న కార్మికులను అకారణంగా తొలగించి 24 కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేశారని విమర్శించారు. కార్మిక శాఖ మొద్దు నిద్రపోతూ అన్యాయంగా, చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవడం మానేసి కార్మికులకు సెటిల్మెంట్ చేసుకోమని ఉచిత సలహాలు ఇవ్వడం మానుకోవాలన్నారు. షేర్ మార్కెట్లో రాక్ సిరామిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వాటాదారులకు లాభాలు పంచుతూ, కార్మికులకు మాత్రం నష్టాలు వస్తున్నాయన్నారు. 85 రోజుల నుంచి ఆందోళన చేస్తున్నా యాజమాన్యం స్పందించకపోవడం అన్యాయమన్నారు. అనంతరం ఆందోళనకారులు కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో రాక్ సిరామిక్స్ ఉద్యోగులు రామకృష్ణ, అర్జున రావు, జీవీ మల్లికార్జునరావు, కాళ్ల మంగారావు, సుబ్బారావు, బి.ప్రభుదాస్, రాజబాబు, ఏవీ సత్యనారాయణ, బీఎస్ఆర్ మూర్తి, గంగాధర్ జీవీవీ సత్యనారాయణ, రామచంద్రయ్య, క్రాంతి, ఎం.రామకృష్ణ, ఎస్.సతీష్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ మంత్రికి ఎమ్మెల్సీ లేఖ

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్ కంపెనీలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు (ఐవీ) రాష్ట్ర కార్మికశాఖ మంత్రికి లేఖ రాసి ఫోన్‌లో మాట్లాడారు. ఈ మేరకు ఆ లేఖను రాక్ సిరామిక్స్‌లో తొలగించిన కార్మికులు స్థానిక విలేకర్లకు విడుదల చేశారు. 24 మంది కార్మికులను గత ఏప్రిల్ 15న విధుల నుంచి తొలగించారన్నారు. జాయింట్ లేబర్ కమిషనర్ వద్ద నాలుగు పర్యాయాలు చర్చలు జరిగినా వారికి న్యాయం జరుగలేదన్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకునేలా ఫ్యాక్టరీ యజమాన్యంతో సంప్రదించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని మంత్రి సుభాష్‌ను ఎమ్మెల్సీ కోరారు.